# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పర్యావరణానికి హాని చేస్తే భావితరాలకు భవిష్యత్ ఉండదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కేన్సర్ ను తొలి దశలోనే నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- మహిళలు, బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షిస్తామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.
- పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణానికి హాని చేస్తే భావితరాలకు భవిష్యత్ ఉండదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సహజవనరుల అవినీతిపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రకృతి సంపద ప్రజలకు చెందాలని, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల పరిరక్షణకు ప్రజలంతా కలిసి రావాలన్నారు. భూగర్భ ఖనిజ సంపద సమాజహితానికి వినియోగించాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూములు, ఖనిజాలు, అటవీ సంపదల్లో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 41 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేన్సర్ ను తొలి దశలోనే నిర్మూలించేందకు చర్యలు చేపడుతున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు కింగ్ జార్జ్ ఆసుపత్రిలో కలెక్టర్ ఎమ్.ఎన్ .హరేంధిర ప్రసాద్, విశాఖ

పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ తో పాటు పలువురు అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన వైద్యులు తయారు కావాల్సిన అవసరం వుందని, అందుకు శక్తివంచనలేకుండా పని చేస్తామన్నారు. జాతీయ వైద్య మండలి ప్రమాణాలకు అనుగుణంగా వైద్యులు, జనాభా నిష్పత్తిని సాధిస్తామ మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలే ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ తరపున గెలుపొందిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులను ఈరోజు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... దేశ రాజకీయ చరిత్రలో జనసేన పార్టీ వంద శాతం విజయాన్ని నమోదు చేసుకుందని అన్నారు. అధికారాన్ని ఒక భాద్యతగా చేపట్టి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలు, బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో బాలికలపై జరుగుతున్న అత్యాచార ఘటనలపై ఈరోజు మంత్రి అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ... అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి కేసులో బాధిత కుటుంబానికి 10 లక్షలు రూపాయల పరిహారం అందజేస్తున్నామని వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటలలో భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండంల పరిటాల వద్ద క్వారీలో ఈరోజు జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించారు. క్వారీలో పై నుంచి లూజు బోల్డర్స్ జారి డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. క్వారీలో పెద్ద రాళ్ల కింద చిక్కుకుని ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే చనిపోగా.. మరో ముగ్గురి ఆచూకీ లభించాల్సి ఉంది. వారికోసం అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కారుణ్య నియామకాలపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కొన్ని చోట్ల తాగునీరు, మురుగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "పిఎమ్ విశ్వకర్మ యోజన పథకా"నికి అధిక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వాటిని క్షుణ్ణంగా

పరిశీలించాలన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ద్విచక్ర  వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని అవగాహన కల్పిస్తూ.. కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఈ ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, నెల రోజుల పాటు వివిధ మార్గాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీనియర్ సివిల్ జడ్జి కృష్ణా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేసే వాహనదారులపై ఆగస్టు నుంచి జరిమానా విధించడం జరుగుతుందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమ గోడపత్రికను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ నెల 18 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మందులను అందిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అలాగే  వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అయితే జిల్లా ఆరోగ్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గత ఐదేళ్ల పాలనలో నీటిపారుదల శాఖ నిర్వీర్యం అయ్యిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈరోజు విజయవాడలోని కె.ఎల్.రావు ఘాట్ లో రాష్ట్ర జలవనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కానూరి లక్ష్మణరావు 122వ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు.  డా.కె.ఎల్.రావు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... కానూరి లక్ష్మణరావు నీటి పారుదల రంగానికి విశేష సేవలు అందించారన్నారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నరు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్డ్ పోలీస్ విభాగం అధికారులు, సిబ్బంది సంపూర్ణ సహకారంతో ప్రశాంతంగా పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించగలిగామని శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. ఆర్. రాధిక అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్పీ జి.ఆర్.రాధిక రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో  ఎస్పీ కు  గౌరవ వందనం సమర్పించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో సుమారు రెండున్నర సంవత్సరాలు పని చేశానని, జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బంది తమ సహాయ సహకారాలు అందించారని  పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ ఆధారితమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సాగు పనులు వేగవంతంగా సాగుతున్నాయని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ బోసుబాబు తెలిపారు. అమలాపురంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ… ఖరీఫ్ పంట కాలంలో  జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో వరిసేద్యం జరగనుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు మరింత వేగం పుంజుకున్నాయని, ఇప్పటికే 90 శాతం నారుమళ్లు పూర్తయ్యాయని తెలిపారు.

=======================

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరం చూపుతున్నామని శ్రీ సత్యసాయి జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్  ఎన్.విష్ణువు అన్నారు. ఈరోజు పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూన్నామని అన్నారు.

ఏలూరు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

=======================

=======================